## క్లుప్తంగా

### బాధ్యతలు చేపట్టిన రాచర్ల ఆర్ఐ



ఆర్ఐ హర్షగౌడ్

రాచర్ల: రాచర్ల ఆర్ఐగా కంచర్ల హర్షగౌడ్ బుధవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. గతంలో మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదోన్నతిపై రాచర్ల మండలానికి ఆర్ఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై అహరోన్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో మద్యం సేవించి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 36 మందిపై బుధవారం కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్సై ఎస్ అహరోన్ తెలిపారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించవద్దని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

# తేలని హద్దు.. అభివృద్ధి రద్దు!

- సరిహద్దు గొడవలతో ఇందిరమ్మ కాలనీలో అభివృద్ధి శూన్యం
- కాలనీ ఏర్పడి సుమారు 20 ఏళ్లు
- మున్సిపాలిటీనా.. గ్రామ పంచాయతీనా అనేది అర్థం కాని పరిస్థితి
- మౌలిక వసతులతోపాటు శ్మశాన వాటిక లేక కాలనీవాసుల ఇక్కట్లు



కాలనీలో రోడ్డు దుస్థితి

మార్కాపురం టౌన్:

అక్కడ సుమారు 200 ఇళ్లున్నాయి.. దాదాపు 1800 మంది వరకు నివసిస్తున్నారు. మార్కాపురం పట్టణ శివారులో ఉన్న ఆ ప్రాంతం పేరు ఇందిరమ్మ కాలనీ. ఇంత మంది నివాసం ఉంటున్న ఆ కాలనీలో కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. ఈ కాలనీకి ఓ వైపు నరసింహారం పంచాయతీ, మరో వైపు మార్కాపురం పట్టణం ఉండటంతో ఏ పరిధిలోకి వస్తుందో అధికారులు నేటికీ తేల్చకుండా నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారు. దీంతో కాలనీ వాసుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

మార్కాపురం పట్టణ శివారులో ఇందిరమ్మ కాలనీ ఏర్పడి సుమారు 20 ఏళ్లు అవుతున్నా కనీస వసతులు లేని దుస్థితి. కాలనీలో నివాసాలు నిర్మించుకున్న వారు అరకొర వసతుల మధ్యనే ఇబ్బందులు పడుతూ తమ జీవితాలను నెట్టుకొస్తున్నారు. 2006–07లో సుమారు 200 మంది గృహాలు నిర్మించుకున్నారు. మరికొందరు శ్లాబు దశ వరకు నివాసాలు నిర్మించుకుని వసతులు కల్పించకపోవడంతో మధ్యలోనే వదిలేసి పట్టణంలో అద్దె ఇళ్లలో ఉంటున్నారు. కాలనీకి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా గోతుల్లో నీరు నిలుస్తోంది. మెతక మట్టి కావడంతో రోడ్డు మొత్తం జారుతోంది. వాహనాల రాకపోకల సంగతి అటుంచితే కనీసం అడుగుతీసి అడుగు వేయాలన్నా ఇబ్బందులుపడుతున్నారు. విద్యుత్ స్తంభాలున్నా కొన్ని వీధుల్లో లైట్లు ఏర్పాటు చేయలేదు. దీంతో స్థానికులే చందాలు లైట్లు బిగించుకున్నారు. చీకటి పడుతుందంటే చాలు కాలనీ వాసుల గుండెల్లో దడ మొదలవుతోంది. ఇప్పటి వరకు సుమారు వంద పాములు చంపినట్లు కాలనీ వాసులు చెబుతున్నారు. కాలనీలో 8 బోర్లున్నాయి కానీ పైపులైన్లు ఏర్పాటు చేయకపోవడంతో నీటి సమస్య వేధిస్తోంది. వాటర్ ట్యాంక్ నిర్మించినా, నిధుల కొరత మూలంగా కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదు. దీంతో కాలనీ వాసులే చందాలు వేసుకుని 2 మినీ ట్యాంక్‌లు నిర్మించుకున్నారు. విద్యుత్ లేని సమయంలో మినీ ట్యాంకుల నీటిని వినియోగించుకుంటురు. మంచి నీటి కోసం 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న మార్కాపురానికి పరుగులు తీస్తున్నారు.




### కనీస సౌకర్యాలు నిల్

ఇందిరమ్మ కాలనీలో వైద్యశాల, పాఠశాల, అంగన్‌వాడీ సెంటరు, రేషన్‌షాపు.. ఇలాంటి ఏవీ లేవు. పాఠశాలలకు వెళ్లాలంటే 4 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సిందే. కూలీ చేసి సంపాదించుకున్న మొత్తంలో విద్య, వైద్యం, మంచినీటి కోసం అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. శ్మశానవాటికకు స్థలం లేకపోవడంతో మార్కాపురం పట్టణంలోని శ్మశానవాటికల్లో ఖననం చేయాల్సిన దుస్థితి.



అసంపూర్తిగా నిలిచిన గృహాలు



ఇందిరమ్మ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి

### పోలీసుల గస్తీ శూన్యం

కాలనీలో ఖాళీగా ఉన్న గృహాల్లో విచ్చలవిడిగా పేకాట, వ్యభిచారం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ తిరగకపోవడంతో వీరి ఆగడాలు మరింత ఎక్కువ అవుతున్నాయని చెబుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కోరితే అదిగో ఇదిగో అంటున్నారే తప్ప పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఓవర్‌హెడ్ ట్యాంకులున్నా నిరుపయోగం



ఇందిరమ్మ కాలనీ ప్రజల అవసరాల కోసం రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను ఏర్పాటు చేయగా అందులో 1 అసంపూర్తిగా నిలిచింది. మరొకటి పూర్తయినా నీటి సరఫరా లేకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాం. మార్కాపురం వెళ్లి మంచినీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– టి.సుబ్బులు, మహిళ, ఇందిరమ్మకాలనీ


### మౌలిక వసతులు లేవు



కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నాం. డ్రైనేజీ, రోడ్లు, వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. మధ్యలో ఆపేసిన ఇళ్ల వద్ద చెట్లు పెరిగి విష పురుగులకు ఆవాసాలుగా మారాయి. అధికారులు స్పందించి మౌలిక వసతులను కల్పించాలి.

– జి.జాన్‌డేవిడ్, ఇందిరమ్మ కాలనీ వాసి





అసంపూర్తిగా, నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకులు

### బాలికల ఉన్నత పాఠశాల తనిఖీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం వైఎస్సార్ జిల్లాకు చెందిన సోషల్ ఆడిట్ అధికారులు ఓబులేసు, దిలీప్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మౌలిక వసతులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు తదితర విషయాలపై విద్యార్థులను ఆరా తీశారు. పాఠశాలలోని సిబ్బంది, విద్యార్థుల రిజిస్టర్లు పరిశీలించారు. తనిఖీ సమయంలో పాఠశాల హెచ్‌ఎం నాగభూషణ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

### ఇష్టపడి చదివితే నూరు శాతం ఫలితాలు

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం కాలేజీలో బాషా సామర్థ్యంపై బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా కోఆర్డినేటర్ డి.జయ మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఉత్తమ ఫలితాలతోపాటు అత్యుత్తమ ప్రమాణాలు సాధించేందుకు విద్యార్థులను సంసిద్ధం చేయాలన్నారు. ఉపాధ్యాయులు అడిగిన సమస్యలను కోర్సు డైరెక్టర్లు నివృత్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ మానిటరింగ్ అధికారి వి.నారాయణరాజు, ఎం.సుధాకర్, టీఏ ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

### మెడికల్ షాపుల్లో నిబంధనలు పాటించాలి



మందులను తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణి

గిద్దలూరు రూరల్: మార్కాపురం మెడికల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బి.వి.ఉషారాణి బుధవారం పట్టణంలోని గణేష్‌నగర్‌లోని మెడిక్ స్టాక్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలో 65 లైసెన్స్‌డ్ మెడికల్ షాపులు ఉన్నాయని తెలిపారు. మెడికల్ షాపుల్లో మందుల శాంపిళ్లను సేకరించి నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునేందుకు విజయవాడలోని ల్యాబ్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు. ల్యాబ్ నివేదికల ఆధారంగా షాపుల యజమానులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల కంభంలో అనుమతి లేని మెడికల్ షాపును గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాలం చెల్లిన మందులను తక్షణమే తీసివేయాలని చెప్పారు. ఆమె వెంట సిబ్బంది, మెడికల్ షాపుల సంఘం సభ్యులు ఉన్నారు.

### వెలుగొండ నిర్వాసితులకు
## నష్టపరిహారం ఇవ్వాలి

మార్కాపురం: వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం విడుదల చేయాలని నిర్వాసితుల సంఘం అధ్యక్షులు గాలి వెంకటరామిరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిర్వాసిత ప్రాంతాలైన కాటంరాజు తండా, మాగుటూరు తండా, చింతలముడిప తండాల్లో నివసిస్తున్న ఒక్కో కుటుంబానికి రూ.12.50 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. కాటంరాజు తండా నిర్వాసితులకు వచ్చిన నష్టపరిహారం వారికే ఇవ్వాలని, ఇతర ప్రాంతాల వారికి ఇచ్చేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు.



### 12 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు
## షోకాజ్ నోటీసులు



సమీక్షలో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీనివాసులు, హౌసింగ్ డీఈ పవన్‌కుమార్

మార్కాపురం: గృహ నిర్మాణశాఖలో పురోగతి లేకుండా 0లో ఉన్న 12 మంది సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజు నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, హౌసింగ్ డీఈ పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ, ఉపాధి హామీ పథకం అమలుపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గ్రామ స్థాయిలో తమకు నిర్దేశించిన గృహ నిర్మాణాల లక్ష్య సాధనకు పని చేయాలని చెప్పారు. వివిధ దశల్లో ఉన్న ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా పూర్తిచేయించాలని, మార్చి 31లోపు ఇంటి నిర్మాణాలు పూర్తి కాకపోతే కేంద్ర ప్రభుత్వ నిధులు ఆగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గృహ నిర్మాణ పథకానికి ఉపాధి హామీ పథకం కలిపినందున ఒక్కో ఇంటి నిర్మాణానికి 90 పనిదినాలు వస్తాయన్నారు. మార్కాపురం మండలంలో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలకు సంబంధించి 15 వేల పని దినాలకు నగదు రావాల్సి ఉందని ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జీవరత్నం, పంచాయతీరాజ్ ఏఈ మోహన్‌రాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఐదుగురు పంచాయతీ సెక్రటరీలకు మెమోలు

తర్లుపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి గైర్హాజరైన పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ అయ్యాయి. నాగెళ్లముడుపు, తర్లుపాడు, సీతానాగులవరం, కలుజువ్వలపాడు, రాగసముద్రం సెక్రటరీలకు ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ మెమోలు జారీ చేశారు. మరికొందరు డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు కూడా సంజాయిషీ ఇవ్వాలని షోకాజ్ నోటీసులిచ్చారు.

## పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి



నాగంపల్లిలో జీవాలకు నట్టల మందు తాగిస్తున్న పశువైద్యాధికారి



అనుములపల్లెలో గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి హరిబాబు

రాచర్ల: పశువుల ఆరోగ్యంపై పశుపోషకులు జాగ్రత్తగా ఉండాలని పశువైద్యాధికారి హరిబాబు సూచించారు. మండలంలోని అనుములపల్లె, గుడిమెట్ట గ్రామాల్లో బుధవారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిపశువులకు అనారోగ్యానికి గురైతే వెంటనే పశువైద్యాధికారులకు సంప్రదించి తగిన మందులను తీసుకోవాలని సూచించారు. పశువులకు సోకే వ్యాధులు, నివారణ మార్గాల గురించి వివరించారు. మేకలు, గొర్రెలకు చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనుమలవీడు, అనుములపల్లె పశువైద్యాధికారులు చక్రవర్తి, శ్రావణ్‌కుమార్, సిబ్బంది రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

**క్షేత్రస్థాయిలో పశువైద్య సేవలు**

కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లి గ్రామంలో బుధవారం పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పశువుల పెంపకంలో జాగ్రత్తలు, సీజనల్, ఇతర వ్యాధుల నివారణపై గొట్లగట్టు పశువైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. ఆదాయం తెచ్చిపెట్టే మూగజీవాల ఆరోగ్యంపై పోషకులు శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. పశువులకు కృత్రిమ గర్భధారణ చేశారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, సహాయకులు మేఘవత్ శివాజి నాయక్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, పశుపోషకులు ఉన్నారు.

పొదిలి రూరల్: మండలంలోని మల్లవరంలో బుధవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నగురువాయుపాలెం పశువైద్యాధికారి మంచికల మణిశేఖర్ మాట్లాడుతూ.. పశువుల్లో జబ్బవాపు, గొంతువాపు, గాలికుంటు, చర్మ సంబంధ వ్యాధులపై అవగాహన కల్పించారు. గొర్రెలు, మేకలు, దూడలకు నట్టల నివారణ మందు తాపించాలని సూచించారు. పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎస్సై కోటేశ్వరరావు

రాచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్సై పి.కోటేశ్వరరావు సహకారంతో స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. టెన్త్‌లో అత్యధికంగా మార్కులు సాధించి పాఠశాలతోపాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంఈవో వారణాసి గిరిధర్‌శర్మ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సమకూర్చిన ఎస్సై పి.కోటేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో–1 కోటేశ్వరరావు, హెచ్‌ఎం బీఎల్ రామానాయక్, చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్, పాఠశాల చైర్మన్ గజ్జ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ రికార్డులు అప్పగించండి



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

బేస్తవారిపేట: ఎన్ఆర్ఈజీఎస్‌లో చేపట్టిన ప్రతి పనినీ తనిఖీ చేయనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక దరగా రోడ్డులోని ఏపీడీ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ, ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 2019–20 నుంచి 2023–24 వరకు 53 పంచాయతీల్లో ఫారంపాండ్స్, ఊటకుంటలు, ఉపాధి హామీ పనుల్లో దొంగమస్టర్లతో నిధులను దుర్వినియోగం చేశారని కలెక్టర్‌కు బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపూడి జయరామ్ చేసిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేపడుతున్నట్లు వివరించారు. పంచాయతీల్లో చేపట్టిన పనుల వివరాలు, ఎం–బుక్‌లు అందజేయాలని విచారణ అధికారి సూచించగా వారం రోజుల వ్యవధి ఇవ్వాలని ఈసీ, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. మండలంలోని నేకునాంబాద్‌లో ఫారంపాండ్, ఊటకుంటలను, పెద్ద ఓబినేనిపల్లెలో ట్రెంచ్ వర్క్‌లను ఈడీ పరిశీలించారు. సమావేశంలో డ్వామా ఏపీడీ భాస్కరరావు, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు పాల్గొన్నారు.